# శారద

రచన: "మాధవ్"

(గత సంచిక తరువాయి)

ఏదో స్టేషన్‌లో రైలు ఆగింది. అతను దిగి వెళ్ళి రెండు కాఫీలు తెప్పించేడు. టిఫిన్ ఏదైనా తీసుకో శారదా! ఉదయంనుండి ఏంతీసుకోలేదు, అంటూ ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు.

ఉండండి. బాత్‌రూమ్‌కి వెళ్ళాలి అని లేచి అక్కడి నుండి తిన్నగా వెళ్ళిపోయి తనివితీరా ఏడ్చి, ఏ అశుభ క్షణాన్న మీరు నా హృదయంలో ప్రవేశించారో నాకు శాంతి లేకుండా పోతోంది. మిమ్మల్ని మరువలేకుండా ఉన్నాను జీవితంలో రాజీపడలేకుండా ఉన్నాను. నా కర్తవ్యమేమిటి అని ఆలోచిస్తూ, ముఖం కడుక్కొని, చీర చెంగులో ముఖం తుడుచుకుంటూ వచ్చి బెర్తుమీద కూర్చుంది. అప్పటికే అతను ప్రభ వారపత్రిక తెచ్చి అక్కడ పెట్టి మళ్ళీ మాటల్లో మునిగిపోయేడు.

ఆ పుస్తకం చూస్తూ మళ్ళీ తన గత జీవితపు సంఘటనలను నెమరు వేసుకుంటోంది. అన్నయ్య పెళ్ళిలో అంతా తనని హేళనగా చూసినట్లే అనిపించింది. అన్నయ్య చేసిన ప్రచారానికి తను బాధపడింది గాని అన్నయ్య పెళ్ళి చేసుకున్నందుకు కాదని, తనకి పెళ్ళి అవనందుకు గాని కాదని ఎవరికి తెలుసు. వాళ్ళు ఎలాగూ హైదరాబాద్ వెళ్ళిపోయేరు.

* * *

ఒకరోజు సాయంత్రం ఏం తోచక వీధి గుమ్మంలో నిలబడి, వచ్చేపోయేవారిని చూస్తోంది. పోస్టుమెన్ ఉత్తరం తెచ్చి చేతిలోపెట్టి వెళ్ళిపోయాడు. నిర్లక్ష్యంగా ఎవరు రాసేరా అని చూసింది. ఆ చేవ్రాలు అన్నయ్యదే ఆ! ఎప్పుడూ ఉండేదేకదా! అని విప్పి చూసింది. అందులో ఉన్న పంక్తులగుండా కళ్ళు పరుగెత్తుతున్నాయి. శరీరం తన వశం తప్పిపోతోంది. ఎలా వెళ్ళి మంచం మీద వాలిపోయిందో తనకే తెలియదు. తను చదివింది నిజం కాకూడదని వేయిదేవుళ్ళకు మొక్కుతూ మళ్ళీ చదివింది. "శ్రీధర్ కనుపించాడు. విదేశాలనుండి తిరిగి వచ్చాడు. మనిషి పూర్వం కన్నా చాల బాగున్నాడు. మంచి హోదాలో ఉన్నాడు. వాళ్ళ యింటికి ఆహ్వానించాడు. వెళ్ళాను. తన భార్యను చూపించాడు. అతనికి తగినది కాకపోయినా బాగానేవుంది. బాగా చదువుకుంది. అయితే శ్రీధర్ ఇప్పుడు హిందూ కాదు, క్రిస్టియన్. ఆవిడ మతంలోకి చేరితేనే గాని వివాహం జరగదని అందిట. అందుకు అతను మతం మార్చుకున్నాడు. ఏదిదేమైనా అతను ఇప్పుడు చాలా ఆనందంగా ఉన్నాడు. అని ఇంకా ఏవో విషయాలు వ్రాశాడు. శారద గుండె అదిరేలా ఏడ్చి, ఎంతపని చేశాడు శ్రీధర్. ఇక్కడ మీ కోసం వేయికళ్ళతో మీ రాకకై ఎదురుచూస్తూనే ఉన్నట్టు మీ కెలా తెలుస్తుంది. అది మీ తప్పుకాదు. మిమ్మల్ని నిందించడానికి తెలిసి ఎలాటి ఆశలు లేపలేదు, నేనే మీ ప్రతీ పని మాటా తప్పుగా అర్థం చేసుకొన్నాను అని వాపోయింది.

తల్లి పురాణంనుంచి వచ్చి 'శారదా! ఏం చేస్తున్నావ్' అంటూ పిలిచేదాకా ఈలోకంలో లేదు. శక్తినంతా కూడదీసుకొని అన్యమనస్కంగా వెళ్ళి భోజనానికి కూర్చుంది. ఏ? అలా ఉన్నావు. జ్వరం వచ్చిందా? ముఖం అలా ఉందేం అంటూవున్న తల్లి మాటలు వినిపించుకునే స్థితిలో లేదు. ఆఖరికి జాలి వచ్చినట్టు అందులో సంగతులు చెప్పింది. ఆవిడ మొదట నిర్ఘాంతపోయినా తరువాత కొంత తేరుకొని, ఆ! పిల్లల్ని అంతంతదూరం పంపిస్తే వాళ్ళు ఇలాగే తయారవుతారు. ఫణి ఏంచేస్తాడో అంతదూరం వెళ్ళిపోయాడు అని బాధపడేదాన్ని. అతు[illegible]ణంగా మనవాళ్ళ పిల్లని చేసుకున్నాడు. అంటూ నిట్టూర్చింది. శారద తన మూగబాధను ఎవరితో చెప్పుకుంటుంది.

ఏం తిన్నదో తనకే తెలియదు. అలాటి పరిస్థితిలో ఏం మాట్లాడినా ప్రమాదమేనని వెళ్ళి తన మంచంమీద పడుకుంది. ఎంతసేపు అలా మౌనంగా ఏడ్చిందో అలసి నిద్రపోయింది. పద్మప్రియుడు తన కిరణాలు లోకం అంతా విరజిమ్ముతూ, అరుణకిరణాల కాంతిలో సంచారానికి బయలుదేరాడు. అమ్మ పిలుపులో శారద లేచింది. రోజూ రాధాకృష్ణులు ఉన్న క్యాలండరు చూచి దండం పెట్టి, దేవా! మీవంటి అమరప్రేమే కావాలి మాది కూడా. కాని రాధ అంతటి నిస్వార్థపరురాలను కాను. నాకు శ్రీధర్ వెచ్చని కౌగిలిలో ఒక్కదానిగా జీవితాంతం చోటు కావాలి అని మొక్కుకునేది, కానీ ఈరోజుతో ఆ అవసరం తీరిపోయింది. శ్రీధర్ పరుల సొమ్ము అయిపోయాడు. భగవాన్ ఈరోజునుండి మనశ్శాంతి, సుఖమయ జీవితం శ్రీధర్‌కు ప్రసాదించమని కోరుకుంది. పెరట్లోఉన్న బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది. కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేసి బట్టలుమార్చుకొని హడా

విడిగా తయారై వారింటి దగ్గరకు వెళ్ళి, తన గాథనంతా చెప్పి ఎలాగయినా తనకి ఉద్యోగం వేయించమనా అనుకుంది. అడుగులో అడుగు వేసుకొంటూ వీధి గుమ్మందగ్గరకి వెళ్ళింది. అన్నయ్య స్నేహితుడు పరమేశం అంతట్లో గుమ్మంలో ఎక్కి లోపలికి రాబోయాడు. శారదని చూచి ఆగిపోయాడు. శారద మర్యాదకోసం రండి అమ్మ లోపల ఉంది అంటూ లోపలకు వెళ్ళి అమ్మకు పరమేశం వచ్చినట్టు చెప్పింది. ఆవిడ శారద వైపు అదోలా చూచి బయటకు వచ్చి అతన్ని చూచి యోగక్షేమాలు అడిగింది. ఒకరినొకరు యోగక్షేమాలు పలకరింపులు అయ్యేక, పరమేశమే 'అమ్మా! చెల్లాయికి ఈ సంవత్సరమే పెళ్ళి చేస్తారా?' అన్నాడు.

ఆ! ఎందుకు చెయ్యం సంబంధం దొరికితేగాని అంది అమ్మ.

"అయితే ఆ మాట చెప్పడానికే వచ్చాను. మనం అదివరకు చూచిన సంబంధమే. క్రొత్తది కాదు. ఇప్పుడు ఆ భుజంగం చేసుకుందికి సిద్ధంగా ఉన్నాడు. మీరు అవునంటే ఇది జరగడం ఖాయం.' అని అమ్మ వంక ఆశతో చూశాడు.

'అమ్మాయిని అడగాలికదా! ఫణికి వ్రాయాలి'

ఆ అమ్మాయి ఇక్కడే ఉంది. మనం అవును అంటే కాదు అనదు. ఫణికి తెలిసినా వద్దనడు.

అయితే అమ్మాయిని అడిగివస్తాను అంటూ అమ్మ తన దగ్గరకు రావడం కళ్ళకి కట్టినట్టుంది. తను మరి ఏదీ ఆలోచించకుండా ఒప్పుకుంది. అమ్మ సముద్రుడిలా పొంగిపోయి ఆశ్చర్యపోయింది. క్రిందటిసారి వద్దనలేక వద్దన్నది ఈసారి ఇంత తొందరగా ఒప్పుకొన్నందుకు. అమ్మ ఆనందమాపట్టలేక బయటికివెళ్ళి అతనితో ఏదో అనబోయింది. అతను వెంటనే గ్రహించి, జాతకం అదీ అతని దగ్గరే వుంది, పదిరోజులలో ముహూర్తం పెట్టిస్తాను. ఫణికి వ్రాస్తాను అని వెళ్ళిపోయాడు.

శారద యిప్పుడు పూర్వపు శారదకాదు. ఆశలన్నీ నిరాశలై కోరికలన్నీ అడుగంటిఉన్న సజీవ ప్రతిమ. తనకి అతనిలో వున్న లోపాలన్నీ తెలుసు. క్రొత్తగా త్రాగుతాడనికూడా తెలుసు. కానీ అన్నిటికంటే ముఖ్యమైనది తనవాళ్లు తనకి కట్నం ఇచ్చి పెళ్ళిచెయ్యలేరని కూడా తెలుసు. ఉద్యోగం అవడం అంతకంటే కష్టం అనికూడా తెలుసు. అన్నీ తెలిసి అన్నదమ్ముల దయాదాక్షిణ్యాలమీద జీవించడం ఇష్టంలేక ఒకటి ఆత్మహత్య చేసుకోవడమో లేక ఇటువంటిదే ఏదో ఒకటి ఒప్పుకోవడమో చెయ్యాలి అని అనుకుంది. ఆకాశంలో ఎక్కడో ఒక మెరుపులావున్న ఒక్క ఆశ అడియాశ అయి కూర్చుంది. ఆ అంగీకారమే నేడు ఇతనితో ఇలా ఈ ప్రయాణానికి నాంది. ప్రతిఫలం. అనుకుంటూ లేచి నిలబడింది. అదేసమయంలో కళ్ళు ఒక్కసారి గిఱున తిరిగి ప్రపంచం అంతా రంగులరాట్నంలా తిరిగినట్టయింది. తను ఏదో అధోలోకాలకి దిగజారిపోతూవున్నట్టు అయి మళ్ళీ కూర్చుంది. అదే సమయంలో భుజంగం వచ్చి, 'మీల్సుకి ఆర్డరిచ్చాను వచ్చేస్తుంది. రెడీగావుండు' అనడమే తడవుగా రెండురోజులనుండీ ఏదీ తినలేక మానలేక మనస్సులేని ఈతతంగంలో అలసి ఆకలితో అలమటించిపోతోంది. తన పెళ్ళిపేరుమీద ఎందరో పిండివంటలతోసహా తిని, తనుమాత్రం ఏదీలేని పేదగా ఆకలితో మాడిపోతోంది. భోజనం వచ్చింది. అతను ఏదో అంటున్నాడు అదేమీ చెవులకి సోకడంలేదు. పెరుగు అన్నంమాత్రం గబగబా తినేసింది. అతను ఇదిబాగుంది, అది బాగుంది అంటున్నాడు. ఏదో నోట్లో పెట్టబోయాడు వారించే ఓపిక లేదు. ఏదో ఈలోకంలో ఉన్నట్టే లేదు. రైలు తన గమ్యం చేరే తొందరలో పరుగెత్తుతోంది. దాని ప్రయత్నం ఫలించింది. గూడూరులో రైలు ఆగింది. భుజంగం రైలు దిగి సామాను దింపించి, శారదకోసం ఎదురుచూస్తున్నాడు. శారదకూడా అడుగులో అడుగు వేసుకుంటూ తను పెట్టిన షరతు దగ్గరవుతోంది అన్న భయంతో మెల్లగా ఏం అవుతుందో చివరకి అని అనుకుంటూ అతన్ని చేరుకుంది. బస్సులో ఎక్కడం భగవత్ సన్నిధిని చేరడం ఏమి విశేషము లేకుండా జరిగిపోయేయి. బస్సు సరాసరి కొండమీదికి వెళ్ళిపోయింది. అక్కడ ఒక కాటేజ్ తీసుకొని వెళ్ళి అందులో సామాన్లు పెట్టి స్నానం అవీ ముగించుకొని కూర్చుంది. అతను ఇంతలో తనపనులన్నీ ముగించుకొని రెండుకాఫీలు పట్టుకొనివచ్చి "కాఫీ తాగి దైవదర్శనం చేసుకోవచ్చా" అని హాస్యంగా అన్నాడు. తను చిన్నగా నవ్వి 'ఫరవాలేదు' అంటూ అతనికోటి అందించి తను ఒకటి తీసుకుంది. ఇద్దరూ కలిసి వెంకటాచలపతి ఆలయంలో ప్రవేశించారు. స్పెషల్ దర్శనంకోసం టిక్కెట్లు కొని తెచ్చాడు.

అబ్బ! ఏమని చెప్పాలి అతని వైభవం కన్నుల వైభవంగా ఉంది. కలియుగ వైకుంఠం. ఎంత ఆకర్షణీయంగా ఉంది విగ్రహం. ఎంతెంత దూరంలో నుండి వచ్చారు జనం. అందరి కోర్కెలు తీర్చగల స్వామి నన్నెందుకు మన్నించలేదు. నా మొఱ వినిపించి ఉండదు. అయినా అంతదూరంనుండి అడిగితే ఎలా? వచ్చేజన్మలోనైనా ఈ కోర్కె తీర్చుస్వామి అనుకొంటూంది. తను

ఏతీర్థంలో కలిసినా అవి అన్నీ కరిగిపోయి ఒక్క క్షణం కళ్లు మూసుకొని చేతులుజోడించి "స్వామీ! నే చేసిన పాపాలని క్షమించి, శిక్ష విధించవద్దని నా కోరిక. ఈ లోకంతప్ప ఈ స్వార్థపరులైన మానవుల మధ్యకాక ఏ నరకంలోనైనా ఆ శిక్ష అనుభవించడానికి నేను సిద్ధమే. ఆ నరకంనుండి నన్ను విముక్తి చెయ్యి నా పాప పరిహారానంతరం ఎన్ని జన్మకైనా శ్రీధర్ కే నా స్త్రీత్వం సమర్పించే అవకాశం ప్రసాదించు. ఇతన్ని నేను అన్యాయం చెయ్యడంలేదు. నా లాటి వాళ్లు చాలమంది ఉన్నారు. నేనే వాళ్ళని నా తోనే వివాహ జీవితం మొదలుపెట్టాలని ఇతను కలలు కనడంలేదు. సర్వాంతర్యామిని నీకు తెలియనిది, నేను తెలుపపెట్టవలసినది లేదు.' అని మొక్కింది. శారద కళ్ళ తెరవగానే నవ్వుతూ ఏం కోరుకున్నావ్? పండంటి బాబునా? పాపనా? అంటూ ఆమె చెయ్యి పుచ్చుకుని తీర్థప్రసాదాలు పుచ్చుకొని బయటికి వచ్చి ఫోటోలు, ప్రసాదం కొని తిన్నగా కాటేజికి వచ్చేరు. మళ్ళీ క్రిందికి పోయిందికి బస్సు సిద్ధంగా ఉంది. క్రింద గోవిందరాజుల స్వామిని, అలిమేలు మంగమ్మనిచూసి తిన్నగా తిరుగు ప్రయాణం సాగించేరు. ఇందులో చెప్పుకోతగ్గ విశేషాలు ఏవీలేవు. తిన్నగా స్వస్థానంచేరారు. అతను మద్రాసు, మహాబలిపురం చూద్దామనిఅన్నా శారదే తొందరచేసింది వెళ్ళిపోదామని. అమ్మ, అన్నలు, వదినలు, అంతా చెప్పలేని సంతోషంతో శుభస్వాగతం ఇచ్చారు. స్నానం, భోజనం ముగించేసరికి అంతా మధ్య గదిలో చేరేరు. అందరిలోను వెళ్ళి కూర్చుందికి మనస్సు ఒప్పలేదు. అయినా ఎవరిని నొప్పించ దలుచుకోలేదు. అందుకు వచ్చి కూర్చుంది. పెద్ద వదిన మూడేళ్ళ బాబుని 'అత్తదగ్గరికి వెళ్ళరా! నువ్వంటె ఎంత ముద్దు ఒక్క రోజునే కొత్త? చదువు అదీ చెప్పిస్తుంది.' అంటోంది. అంటె ఈ వయస్సులో బిడ్డాపాప పుట్టరని భుజంగం ఆస్తిపాస్తులకి వీడే హక్కుదారుడనీ. అనే ఉద్దేశానికి ఉపోద్ఘాతం. భుజంగం వాడ్ని ఎత్తుకొని దగ్గరకితీసుకొని ఒళ్లో కూర్చోపెట్టుకొని ముద్దులాడుతూ శారద కళ్ళలోకి చూసాడు, తను తలదించేసుకుంది. ఈ కృత్రిమ ప్రేమాభిమానాలు భరించలేక వెళ్ళి పడుక్కుంది. అందరూ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. మూడు గంటలకి లేచి ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని అమ్మదగ్గర కెళ్ళి 'హారిణిని చూసి వచ్చేస్తాను అందరూ లేచేసరికి' ఎవరితోనూ అనకు అంటూ వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. త్రోవలో నాలుగైదు షాపులలో కావలసినవి కొనుక్కొని హేండ్ బాగ్ లో వేసుకొని హారిణి ఇల్లు చేరింది. అదృష్టవశాత్తు ఒక్కతే ఉంది. శారదని చూసి ఆశ్చర్యపోయింది. కౌగిలించుకొని 'ఎలావచ్చావు ఇలాటి సమయంలో బావగారు వదిలేరా!' అంటూ అడిగింది. శారద ఉత్సాహాన్నంతా కూడదీసుకొని 'నోరుమూద్దూ ఎప్పుడూ హాస్యాలే' అంటూ మాట తప్పించి, ఒక గంట కంతోషంగా కబుర్లు చెప్పుకొని విడిపోతూ 'రేపు వస్తాను' కాస్త అవకాశమిస్తావా, మాట్లాడ్డానికి' అంటూ హాస్యమాడింది హారిణి. తప్పకుండా వస్తావు నాకు తెలుసు అంటూ వెళ్ళిపోయింది శారద.

ఇంటికి వచ్చి కాఫీ తీసుకొని తన గదిలోకి వెళ్ళిపోయింది. భుజంగం, అన్నలు అంతాకలసి అలాషికారు వెళ్ళారని తెలిసి, హాయిగా ఊపిరి పీల్చుకొంది. తొమ్మిది గంటలకి అంతా భోజనాలు ముగించుకొని అంతా ఎవరి మట్టుకు వారు రేపు వెళ్ళిపోతారు కదా! అని సినిమా ప్రోగ్రాం వేశారు. శారద ఉన్నచోటికి వచ్చి సారీ! శారదా! ఈ రోజుకి రెస్టు తీసుకో ప్రయాణంలో అలసిపోయేవు. సినిమా ప్రోగ్రామ్ పెట్టారు ఫణీవాళ్ళు. అంటూ బుగ్గమీద చిటికవేసి 'వెళతాను!' అంటూ అయిష్టంగానే వెళ్ళిపోయేడు. అతను వెళ్ళిపోయేక తను తెచ్చుకున్న మాత్రలు అన్నీ పొడిచేసి నోట్లోపోసుకుని గ్లాసెడు నీళ్ళుతాగి 'ప్రభూ నేను చేస్తూఉన్నది మహాపాపమని తెలుసు. అయినా ఈ వాతావరణంలో ఆత్మీయతా, ఆప్యాయతా లేని మనుష్యులమధ్య బ్రతకలేను. వచ్చేజన్మలోనైనా శ్రీధర్ నే భర్తగా పొందేటట్టు చెయ్యి. అంటూ కళ్ళుమూసుకొని తన పక్కమీద వాలి


## కథాంజలి

(చక్కని కథల మాసపత్రిక)

విడి ప్రతి ... 30 పైసలు.

సంవత్సర చందా ... రూ. 6-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్, మరియు స్వదేశ మిత్రన్ బుక్ స్టాల్సులలోను దొరుకును.

పోయింది. అంతే. మళ్ళీ ఇటునుండి అటు కదలలేదు. మాత్రలు పవర్ ఫుల్ అవడంచేత తొందరగా పనిచేసేయి. ఏ రాత్రికో భుజంగం వచ్చి తనకు వేసిన మంచం మీద పడుకుంటూ "అయ్యో వెర్రిది క్రింద పడుక్కుంది. అయినా నిద్ర లేపడం ఎందుకు" అనుకుంటూ నిద్ర కుపక్రమించేడు.

భానుడు తూర్పున ఉదయించేడు. అందరిని తమ తమ పనుల్లోకి వెళ్ళమన్నట్టు తన రథంపై సంచారం మొదలు పెట్టాడు. అమ్మ లేచింది. వదినెలు లేచారు. అన్నలు లేచారు. భుజంగం లేచాడు. అందరికీ చీకటి తరువాత వెలుగు ఉంది గాని, శారదకి మాత్రం చీకటి తప్ప జీవితంలో వెలుగు కనిపించలేదు. ఆమె ప్రాణాలు అనంత వాయువులలో కలిసిపోయేయి. అమ్మ తొలిరేయి అనంతరం పిల్లని లేపేందుకి వచ్చి కదిపిచూసింది. ఈ ప్రపంచంతో సంబంధం లేకుండా పడిఉంది. గొల్లున ఏడ్చి మీదపడిపోయింది. అందరూ మూగేరు. పరిస్థితి అర్థం అయింది. ఫణి డాక్టరుని తీసుకొచ్చేడు. చూసి లాభం లేదు, ప్రాణంపోయి, చాలా సేపయింది. మందు వేగం పనిచేసింది అని వెళ్ళిపోయేడు.

తరువాత ఎవరికీ ప్రమాదం లేకుండా ఫణి అన్నీ జరిపించి శారద అంతిమయాత్రకు సన్నాహాలు జరిపేడు. అన్ని రంగులలోనికి అత్తవారింటికి దిగపెట్టవలసినది పోయి, ఇలా ఎన్నటికీ తిరిగిరాని చోటికి దిగపెడుతూ ఉన్నందుకు తల్లిగుండె బాదుకొని, ప్రతికండ నా మనసు తెరుగనిది విలపిస్తోంది. పూవులు పట్టుచీర పసుపు కుంకుమలతో అగ్నిలో ఆహుతి అయిపోయింది శారద.

[పాఠకులు ప్రతిఒక్కరూ, నిజంగా ఇటువంటి శారదలు ఉన్నారని, వాళ్ళని గూర్చి ఒక్క కన్నీటిచుక్క మనస్ఫూర్తిగా విడిచి సానుభూతి చూపిస్తే, నా కృషి ఫలించి నా శారదకి న్యాయం జరిగినట్టే భావిస్తాను. శారదకి ఆత్మశాంతి చేకూర్చినవారవుతారు.]

(సమాప్తం)

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులు కాదు. —సంపాదకుడు



కౌముది పిక్చర్స్ వారి

"కోడెనాగు" చిత్రంలో

లక్ష్మి.